క్రీస్తు బోధనలు అనుసరణీయం

● అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు ● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కూకట్‌పల్లి జోన్ పరిధిలో సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కూకట్‌పల్లిలోని భాగ్యనగర్ సెంట్రల్ చర్చ్‌లో నిర్మలమ్మ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ప్రార్థనలో సువార్తికులు కృపారాజ్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. శాంతాక్లాజ్ వేషధారణలో పలువురు చర్చిల వద్ద అలరించారు. కాలనీల్లో జరిగిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని అన్నారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం


భాగ్యనగర్ సెంట్రల్ చర్చ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న నిర్మలమ్మ, కృపారాజ్


జెరుసలేమ్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు


పీస్ టెంపుల్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, డేవిడ్ డానియల్


దైవకృపా చర్చిలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న పాస్టర్ సత్యరాజ్


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్


క్రిస్మస్ వేడుకలకు భారీగా హాజరైన క్రైస్తవులు


ఆస్‌బెస్టాస్‌హిల్స్ కాలనీలోని సెయింట్ పాల్స్ యునైటెడ్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో సంజీవరావు



వివేకానందనగర్ కాలనీలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, పాస్టర్లు


న్యూ అపోస్టలిక్ చర్చిలో జరిగిన వేడుకల్లో తూము శ్రావణ్‌కుమార్, పాస్టర్ శామ్యూల్


ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని చర్చిలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఆర్థిక సాయం

బాలానగర్: కూకట్‌పల్లి తులసీనగర్‌లో మధుసూదన్‌రావు, కుమారుడు గిరిధర్ కృష్ణలు నివాసముంటున్నారు. కుమారుడు గిరిధర్ కృష్ణ (8) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తండ్రి కూలి పనిచేసుకుంటూ కుమారుడిని ఆస్పత్రిలో చికిత్స చేయించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను కలిసి తన కొడుకు అనారోగ్య సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చాడు. వెంటనే స్పందించిన బండి రమేష్ తన ట్రస్టు ద్వారా వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఆయన కార్యాలయంలో మధుసూదన్‌రావుకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్‌రెడ్డి, ముక్తార్, అందే శ్రీరామ్మూర్తి, ముఖేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, జోగు కృష్ణ, మల్లేష్, తూము సంతోష్, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాజీనగర్ అధ్యక్షుడిగా విజయ్‌గౌడ్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శివాజీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు సోమవారం స్థానిక కమ్యూనిటీహాల్‌లో జరిగాయి. అధ్యక్ష పదవికి టి. సత్యనారాయణ, ఎస్. విజయ్‌గౌడ్ పోటీలో ఉన్నారని ఎన్నికల ప్రధాన అధికారి పి. చంద్రశేఖర్, సహాయ అధికారి అభిలాషలు తెలిపారు. సత్యనారాయణపై విజయగౌడ్ గెలుపొందారని తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌గౌడ్ మాట్లాడుతూ... శివాజీనగర్‌ను అల్లాపూర్ డివిజన్‌లో సమస్యలు లేని ప్రాంతంగా, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిగా ఓబీసీని నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షుడిగా ఓబీసీ నేతను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. సోమవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీకి మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తెలంగాణలో 55 శాతం పైగా ఉన్న ఓబీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందన్నారు. సీఎంగా రెడ్డిని, డిప్యూటీ సీఎంగా ఎస్సీని నియమించిన కాంగ్రెస్ అధిష్టానం పార్టీ అధ్యక్షుడిగా ఓబీసీని నియమించాలన్నారు.

సోచ్ నుంచి రెడ్ డాట్ కలెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయ ఎత్నిక్ వేర్‌కు పేరొందిన దుస్తుల సోచ్ బ్రాండ్... రెడ్ డాట్ సేల్ పేరిట సరికొత్త కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. వింటర్ సీజన్ స్పెషల్‌గా చీరలు, సల్వార్ సూట్లు, కుర్తాలు, కుర్తా సెట్‌లు, డ్రెస్ మెటీరియల్స్, ట్యూనిక్స్ కఫ్తాన్‌లతో సహా ఈవెనింగ్, అకేషనల్ వేర్ తదితర దుస్తులు ఈ కలెక్షన్‌లో ఉన్నాయని, నగరంలోని తమ అన్ని స్టోర్స్‌లో ఇవి అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలి

లిబర్టీ: భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. పాలకులు మనుమాదస్మృతిని అమలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిసెంబర్ 25వ తేదీన 1927లో మనస్మృతిని దహనం చేసిన సందర్భంగా సోమవారం మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనువాదం ప్రజల మధ్య చిచ్చుపెట్టి కులాలుగా విభజించే విధానం ఉండేదని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు భరోసా అభినందనీయం

లిబర్టీ: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రమాద బీమాను కల్పిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరు మల్లేష్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని ప్రభుత్వం పక్షాన స్పష్టమైన ప్రకటన చేశారన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తామని వారి సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో సైతం పెట్టిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రమాద బీమా సౌకర్యంతో పాటు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు


నర్సింగ్‌రావు, సాయిని సన్మానిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం నర్సింగ్ రావు, సాయి జన్మదిన వేడుకలను సోమవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బర్త్ డే కేక్‌ను వారితో కట్ చేయించారు. అనంతరం శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్రి యాదగిరి, మల్లేష్‌యాదవ్, ఇబ్బు బాయి, లచ్చగౌడ్, రాజేష్, మోహిత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సర్కారు కుట్రలను తిప్పికొట్టాలి


సుందరయ్య పార్కు వద్ద మనుధర్మ శాస్త్రం ప్రతులను దహనం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్ఎస్ఎస్ రిమోట్ కంట్రోల్‌తో పని చేస్తున్న బీజేపీ సర్కార్ రాజ్యాంగ రద్దుకు చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. మనుషుల మధ్య ద్వేషాన్ని నింపి అనైక్యతను సృష్టించిన మనుస్మృతి భావాలను వ్యతిరేకించాలన్నారు. సోమవారం సుందరయ్య పార్కు వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో మనుస్మృతి గ్రంథం ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ... ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా మన దేశంలో సామాజిక అసమానతలను మనుధర్మ శాస్త్రం సృష్టించిందన్నారు. దేశంలో నూటికి 90 శాతం మందికి చదువు, సంపదలు దూరం చేసి కేవలం పది శాతం మంది కోసం మేజార్టీ ప్రజలను బానిసలుగా మార్చిందని విమర్శించారు. మనువాదాన్ని ఈ దేశం మట్టిలోనే పాతరేయాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని కాపాడడానికి దోపిడి వ్యవస్థ రక్షణకై పుట్టిందే మనువాదం అని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు ఎస్.బాలు, బి.సుబ్బారావు, జి.రాములు, పవన్, చెన్నయ్య, పి.వెంకన్న, లక్ష్మి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్లూలో ఉద్యోగాలను భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ) ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారులను కోరారు. ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ 93 (బోధనేతర ఉద్యోగాలు) పోస్టులకు ఆరు నెలల క్రితం నోటిఫికేషన్లు జారీ కాగా వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇంత వరకు ఉద్యోగాల భర్తీకి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు చేపట్టక పోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

శుభాకాంక్షలు



అల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం ఆయన నివాసంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్, దొంతి కార్తీక్ గౌడ్, ఫయాజ్, ఏ. రమేష్, పల్నాటి అశోక్, మహేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'స్వరమాధురి' రజతోత్సవాలు


సంగీత కార్యక్రమాలు నిర్వహించిన చిన్నారులతో శుత్రకీర్తి, జ్యోతిశరత్, అహల్య తదితరులు

చిక్కడపల్లి: స్వరమాధురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ మ్యూజిక్ సంస్థ రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో సంస్థ విద్యార్థులు వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్య, త్యాగరాజు, శామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్‌ల కీర్తనలను మధురంగా ఆలపించి శ్రోతలను రంజింపచేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు, గాయని చెన్నాప్రగడ అహల్యతో పాటు పలువురు ఆలపించిన కీర్తనలు గానసభలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకువచ్చాయి. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నృత్యవిభాగం హెడ్ డాక్టర్ శుత్రకీర్తి జొన్నలగడ్డ మాట్లాడుతూ... సంగీతం అభ్యాసంతో విద్యార్థుల్లో ఏకాగ్రత అలవడుతుందన్నారు. శాస్త్రీయ సంగీతం పట్ల చిన్నారులను ఆకర్షితులను చేసి వారికి సంగీతంలో శిక్షణ ఇప్పించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెన్నాప్రగడ శిరీష్‌కుమార్, చెన్నాప్రగడ అహల్య, స్పిరిచువల్ ఆరేటర్, టీవీ ప్రెజెంటర్ జ్యోతి శరత్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ స్టూడియో మలుపు వద్ద అక్రమ నిర్మాణం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.2 ప్రధాన రహదారి నుంచి అన్నపూర్ణ స్టూడియోకు వెళ్లే రోడ్డులో మలుపు వద్ద రోడ్డును ఆక్రమించి ఓ బిల్డింగ్ సెట్‌బ్యాక్ స్థలంలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాడు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో చలనం కరువైంది. గత మూడు నెలల నుంచి జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో తలమునకలై ఉండగా ఇదే అదునుగా చూసుకున్న కబ్జాదారులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడే రోడ్డు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం కూడా ఉంది. ఈ అక్రమ నిర్మాణం పూర్తిగా రోడ్డులోనే నిర్మించగా మూడేళ్ల క్రితం సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణాలు కూల్చివేశారు. అయితే ఆక్రమణదారులు మరోసారి తెగించారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి ఇక్కడి నుంచి వాహనదారులు వెళ్లేలా రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇరుముడి కట్టు.. శబరిమలెక్కు!


మూర్తినగర్ నుంచి శబరిమలకు బయల్దేరుతున్న అయ్యప్పస్వాములు

మోతీనగర్: నియమ నిష్టలతో, భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మాల ధరించినట్లయితే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని గురుస్వామి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మూర్తినగర్ నుంచి పలువురు అయ్యప్ప మాల ధరించి స్వాములు గురుస్వామితో ఇరుముడి కట్టించుకొని బయలుదేరారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వామిని దర్శించుకోవటం ఆనవాయితీగా వస్తోందన్నారు. అయ్యప్పస్వామి దర్శనం చేసుకుంటే కష్టాలు దరి చేరవని భక్తుల విశ్వాసమన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి


విద్యార్థులకు బూట్లు పంపిణీ చేస్తున్న మూసాపేట కార్పొరేటర్ మహేందర్



హెచ్ఎంటీ శాతవాహననగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నాయకులు

దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని జోన్ పరిధిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి సేవలను కొనియాడారు. భారతదేశంలో సుపరిపాలన అందించిన ఘనత వాజ్‌పాయికే దక్కుతుందన్నారు. నీతి, నిజాయితీతో కూడిన పరిపాలన వాజ్‌పాయి సొంతమన్నారు. ముఖ్యంగా పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందే విధంగా ఆయన ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. దేశంలో పెద్ద ఎత్తున రోడ్లను నిర్మించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పోఖ్రాన్ అణు బాంబులతో భారతదేశం సత్తా ఏమిటో ప్రపంచానికి తెలియజేశారని పేర్కొన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం


భరత్‌నగర్‌కాలనీ సీనియర్ సిటిజన్ భవనంలో నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్లు


వివేకానందనగర్‌కాలనీలో వాజ్‌పేయి జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కొరదాల నరేష్


వాజ్‌పేయి జయంతి సందర్భంగా మోతీనగర్‌లో సేవా తత్పరులను సన్మానిస్తున్న పినిపే చిన్న అబ్బులు, తదితరులు

నిబంధనలు పాటించని పబ్‌లపై ఫిర్యాదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నం.14లో నిబంధనలకు విరుద్ధంగా ఒకే భవనంలో కొనసాగుతున్న రెండు పబ్‌ల కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆయా పబ్‌లను మూసివేసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..రోడ్ నెం. 14లోని బీఎన్ రెడ్డి కాలనీ సమీపంలో ట్యాప్ పబ్, ఆఫ్టర్ 9 పబ్‌లు కొనసాగుతున్నాయి. అమ్యూజ్‌మెంట్ లైసెన్స్ లేకుండానే వీటిని నిర్వహిస్తున్నారని, డీజే సౌండ్ కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వల్లూరి భరణి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ రెండు పబ్‌లపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ రెండు పబ్‌లు పరిసర ప్రాంతవాసులకు గత కొన్నేళ్లుగా నరకం చూపుతున్నాయని, చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు.



పబ్‌లు కొనసాగుతున్న భవనం ఇదే..

ప్రజల్లో శాస్త్రీయపర ఆలోచనలను పెంచాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో శాస్త్రీయ ఆలోచన పెంచేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ... మనిషిని మనిషిగా చూడని మనుస్మృతిని 96 ఏళ్ల క్రితమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దహనం చేశారని గుర్తు చేశారు. మనుస్మృతి మహిళలు చదువుకోకూడదు, బలహీన వర్గాల వారికి అధికారం, సంపద ఉండకూడదని భావించిందని అన్నారు. మూఢనమ్మకాలతో కూడిన కుల వ్యవస్థను నిర్మాణం చేసే మనుస్మృతి అవశేషాలు ఇంకా వివిధ రూపాల్లో కనిపిస్తున్నాయన్నారు. జి.రాములు, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, కె.పర్వతాలు, బి.భిక్షమయ్య, ఉపేందర్‌రెడ్డి, ఎస్.సిద్ధి రాములు, పి.రాంబాబు, సబ్బన లత, ధనలక్ష్మి, వడ్ల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కమల డ్యాన్స్ అకాడమీ 5వ వార్షికోత్సవం సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు అన్నమయ్య, రామదాసు కీర్తనలపై ప్రదర్శించిన పలు సాంస్కృతిక నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా కమల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ దాసరి సురేఖ మాట్లాడుతూ... తమ అకాడమీ విద్యార్థులు తిరుపతి, జోగులాంబ తదితర ప్రముఖమైన దేవాలయాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారని తెలిపారు.

